సాక్షి శ్రీకాకుళం

సోమవారం ౹ 25 ౹ నవంబర్ ౹ 2024



మందుల కొరత

మూగజీవాలను మందుల కొరత వేధిస్తోంది. పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు.

- 8లో



ఉత్సాహంగా స్పెల్‌బీ..

జిల్లా స్థాయి సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్స్ బీ ఉత్సాహంగా జరిగాయి. భారీగా విద్యార్థులు హాజరయ్యారు.

- 8లో

పాండవుల మెట్టపై జూదం

టెక్కలి రూరల్: మండలంలోని పాండవుల మెట్ట సమీప తోటల్లో జూదం ఆడుతున్నారనే సమాచారం మేరకు ఆదివారం టెక్కలి ఎస్ఐ రఘునాథరావు తన సిబ్బందితో కలసి పాండవుల మెట్ట సమీప ప్రాంతాల్లో దాడి చేశారు. ఈ దాడిలో సుమారు 24 మంది జూదం ఆడుతున్నట్లు తెలుసుకుని వారిని అదుపులో తీసుకున్నారు. అనంతరం వారి వద్ద నుంచి సుమారు రూ.లక్ష34వేలు స్వాధీనం చేసుకుని వారిని స్టేషన్‌కు తరలించారు. వారి వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

న్యూస్‌రీల్

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు

కాశీబుగ్గ: మందస వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 26న శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. 26న మందసలో, 27న ఇచ్ఛాపురంలో శ్రీ వెంకటేశ్వర ఇంగ్లిష్ మీడియం పాఠశాల వద్ద అందించనున్నట్లు తెలిపారు. దివ్యాంగుల నుంచి ఆర్టీసీ రాయితీ బస్సు పాస్‌లు, చంక కర్రలు, వినికిడి యంత్రాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని, యుఐటీ కార్డు లేని దివ్యాంగులకు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు, సదరం, ధ్రువ పత్రం పాస్‌ఫొటోలు దివ్యాంగత్వంతో కూడిన ఫొటోలు ఫోన్ నంబర్లు తీసుకురావాలని కోరారు. పూర్తి వివరాలకు ఈ సెల్ నంబర్‌కు 9989371952 సంప్రదించాలని కోరారు.

దళితులపై దాడిని ఖండించండి

దాబాగార్డెన్స్: కోటబొమ్మాళి మండలం కిట్టుపురం గ్రామంలో దళితుడైన చల్లా అప్పలరాజుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం విశాఖ జిల్లా ప్రతినిధులు ఎం.సుబ్బన్న, టి.చిరంజీవి తెలిపారు. ఈ మేరకు సీపీఎం కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పెత్తందార్లు అప్పలరాజు ఇంట్లో చొరబడి విపరీతంగా కొట్టారన్నారు. అప్పలరాజు భార్య దమయంతిని ఇనుపరాడ్డుతో తలపై కొట్టగా ఆమె స్పృహ తప్పి పడిపోయిందన్నారు. అదే రోజు ఉదయం 9.30 గంటలకు దమయంతిని కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లగా ఎస్ఐ ఫిర్యాదు తీసుకోకుండా, పెత్తందార్లతో రాజీ చేసుకోమని, లేదంటే అప్పలరాజుపై నాలుగైదు కేసులు పెట్టి రౌడీషీట్ ఓపెన్ చేస్తామని బెదిరించారని తెలిపారు. పెత్తందార్ల అమానుష దాడుల నుంచి దళితులను రక్షించాలని, దోషులను రక్షించాలని చూస్తున్న కోటబొమ్మాళి ఎస్ఐని సస్పెండ్ చేయాలని కోరుతూ ఈ నెల 26 ఉదయం 10 గంటలకు కోటబొమ్మాళి ఎమ్మార్వో కార్యాలయం, పోలీస్ స్టేషన్ వద్ద దళితులతో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు.

అపార్ కోసం అవస్థలు



వీఆర్ఓలు లంచాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్న సీహెచ్ రవి

కాశీబుగ్గ: అపార్ కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వారి అవసరాన్ని ఆసరాగా తీసుకుని కొందరు అవినీతికి పాల్పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి ఆరోపించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్త్ సర్టిఫికెట్ కావాలంటే వీఆర్వోలు వేలాది రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సర్టిఫికెట్లలో దోషాలు సవరించుకునేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారని, అదనపు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని అన్నారు. తక్షణమే కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్, జీవన్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

900 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం



సవరకుడ్డబలో సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

మెళియాపుట్టి: నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు ముమ్మరం చేస్తున్నామని టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ తెలిపారు. ఆదివారం దీనబంధుపురం పంచాయతీ సవరకుడ్డబ గ్రామంలో టెక్కలి, కోటబొమ్మాళి, ఎక్సైజ్ సిబ్బంది సమన్వయంతో కొండప్రాంతంలోని సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటుసారా, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టెక్కలి, కోటబొమ్మాళి ఎస్సైలు సత్యనారాయణమూర్తి, కల్యాణి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

పాతపట్నం: ఎక్సైజ్ సిబ్బంది ఆదివారం మండలంలోని చాపరాయిగూడ గ్రామంలో నాటు సారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు.

కడలి సాక్షిగా..



కడలి సాక్షిగా అంతా బడలిక మర్చిపోయారు. అలల ఊయలలూగుతూ ఆనందంగా గడిపారు. కార్తీక వన భోజనాల్లో భాగంగా జిల్లా ప్రజలు తీరాల చెంత సేద తీరారు. మొగదాలపాడు, కె.మత్స్యలేశం, శ్రీకూర్మం-మత్స్యలేశం బీచ్‌లలో ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు సందడి చేశారు. – గార

పంట భూములు ఇచ్చేదే లేదు



రాంపురంలో ఆరు పంచాయతీల ఎయిర్‌పోర్టు బాధితుల సమావేశం

- కార్గో ఎయిర్‌పోర్టును వ్యతిరేకిస్తున్న ఉద్దాన వాసులు
- అధికారులను అడుగుపెట్టనీయబోమని కమిటీ తీర్మానం
- ఆరు పంచాయతీల ప్రజల ప్రత్యేక సమావేశంలో వెల్లడి

కాశీబుగ్గ:

'ఉద్దాన ప్రాంత ప్రజలకు అవసరం లేని కార్గో విమానాశ్రయం ఎందుకు నిర్మిస్తున్నారు.. జీవనాధారమైన మా భూములలో పోర్టు వద్దు' అంటూ ఉద్దాన వాసులంతా కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. మందస మండలం రాంపురం గ్రామంలో ఆదివారం పరిసర ప్రాంత ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారంతా తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా బాధిత గ్రామాలకు చెందిన పలువురు మాట్లాడుతూ రుచికరమైన ఉద్దాన జీడి పప్పును ప్రపంచమే మెచ్చిందని అటువంటి పంటను అందిస్తున్న చెట్లు నరికేసి కార్గో విమానాశ్రయం కడితే తాము నిరాశ్రయులమవుతామని అన్నారు. ఉద్దాన ప్రాంత ప్రజల అవసరాలు, మనోభావాలు, అభిప్రాయ సేకరణ లేకుండా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుని బలవంతంగా కార్గో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే ఊరుకోబోమని అన్నారు. ఉద్దాన ప్రాంతంలో ఉన్న ప్రజలంతా కలిసి మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉద్దాన ప్రాంతానికి ఉద్యమాలు కొత్తకాదని నిత్యం వాటిపైనే జీవనం సాగిస్తున్నామని, అలాంటి పంట భూములను పరిహారానికి ఆశపడి ఇవ్వబోమని అన్నారు.



పలాస నియోజకవర్గంలో ఉన్న సముద్రతీర ప్రాంతమైన మందస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన రాంపురం, బేతాళపురం, బహాడపల్లి, చీపురపల్లి, మెట్టూరు, గుణుపల్లి పంచాయతీల పరిధిలో ఉన్న 1383 ఎకరాల భూములను కోల్పోతున్న సుమారు ఇరవై గ్రామాలకు చెందిన ప్రజలంతా ఎదురు తిరుగుతున్నారు. ఇంత మందిని కాదని నిర్మాణ పనులు ఎలా చేపడతారో చూస్తామని అంటున్నారు. ఉద్దాన ప్రాంతానికి అవసరం లేని కార్గో ఎయిర్‌పోర్టు ఎందుకని ప్రభుత్వంతో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా రాంపురం వేదికగా ఉద్దాన ఎయిర్‌పోర్టు పోరాట కమిటీ కన్వీనర్‌గా కొమర వాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో వారం రోజుల్లో అన్ని పంచాయతీల వారీగా కమిటీలు వేసుకుని అనంతరం పోరాట కమిటీని ప్రకటిస్తామని వెల్లడించారు.



హాజరైన మహిళలు

పోరాటాలు మాకేమీ కొత్తకాదు



ఉద్దాన ప్రాంతమైన మందస, వజ్రపుకొత్తూరు మండలాలలో ప్రజాభీష్టం లేకుండా ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపట్టడానికి అధికారులు ముందడుగు వేస్తున్నారు. స్థానికంగా ఉన్న ప్రజలకు, రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గ్రామ తీర్మానాలు లేకుండా ఏ విధంగా చేస్తారో మేమూ చూస్తాం. మా ఉద్దానం ప్రాంతానికి ఉద్యమాలేమి కొత్తకాదు. కార్గో విమానాశ్రయ నిర్మాణాన్ని అడ్డుకుంటాం.

– కొమర వాసు, పోరాట కమిటీ కన్వీనర్, రాంపురం

ఎకరన్నర భూమి పోతే మేము ఎలా బతికేది



మాకు సుమారు ఎకరన్నకు పైగా భూమి ఉంది. అది విమానాశ్రయం నిర్మాణంలో పడిపోతుంది. అందులో పండే పంటలతో పిల్లలను పెంచుకుంటూ వస్తున్నాము. మాకు ముగ్గురు ఆడపిల్లలు, ఒక్క అబ్బాయి ఉన్నారు. ఆడపిల్లలకు వివాహాల అనంతరం అన్ని కష్టసుఖాలతో పాటు బాధ్యతలు చూసుకుంటున్న బాబుకు అదే ఉపాధి మార్గంగా ఉంది. ఇప్పుడు ఎయిర్‌పోర్టు అంటే మేము ఏం చేయాలి. ఎలా బతికేది. అందుకే మేం వ్యతిరేకిస్తున్నాం.

– పొట్టి యశోద, లక్ష్మీపురం

రైతు సంఘం తరఫున అడ్డుకుంటాం



ఉద్దాన ప్రాంతంలో రైతుల కోసం మేమంతా రైతు సంఘం ఏర్పాటు చేసుకుని ఉన్నాం. మా సంఘానికి సైతం సమాచారం లేకుండా స్థల పరిశీలనకు వచ్చేశారు. మాకు రెండు ఎకరాలు తోటలు ఉన్నాయి కొబ్బరి పంట, జీడి పంట పుష్కలంగా పండుతుంది.

– చిత్త గున్నయ్య, చైతన్య రైతు సంఘ సభ్యులు, టి గంగువాడ

మా పొట్ట కొట్టొద్దు



మా భూములు మాకు ఉంటే మాకు నిత్యం జీవనాధారంగా ఉంటాయి. ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం ఇప్పటికిప్పుడు ఖర్చు అయిపోయి మేమంతా కుటుంబాలతో రోడ్డున పడిపోతాం. మాకు ఏ కష్టం వచ్చినా మా తోటకు వెళ్లి కొబ్బరికాయలు, జీడి, మామిడి, మునగ, పనస, కూరగాయలు ఇలా కాలాన్ని బట్టి పంట చేతికంది మా ఖర్చులు తీరుతాయి. మా కుటుంబాలు బతకడానికి ఉపయోగపడతాయి. అందుకు మా పొట్ట కొట్టొద్దని సర్కారుకు వేడుకుంటున్నాము.

– దాసరి మోహనరావు, టి.గంగువాడ

విద్యార్థులను ఇబ్బంది పెట్టకండి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా విద్యార్థికి హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధించడం చేయరాదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఏ కళాశాలలలో అయినా పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్సుమెంటు జరగలేదనే కారణంతో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధిస్తే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల ఫీజు చెల్లించకపోవడం వల్ల కొంత మంది పోస్ట్ మెట్రిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వకపోవడం, వారిని పరీక్షలను రాయనీకపోవడం జరుగుతోందని తమ దృష్టికి వచ్చిందన్నారు. కోర్సు పూర్తయిన విద్యార్థుల సర్టిఫికెట్లను వారికి ఇవ్వకుండా అట్టి పెట్టుకోవడం చేయకూడదని ప్రభుత్వం మార్గదర్శకాలు ఇచ్చిందని, ఎవరైనా కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థుల సర్టిఫికెట్లను హోల్డ్ చేయడం చేస్తే సంబంధిత కళాశాలను బ్లాక్ లిస్టులో పెట్టడం, వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఫీజును కళాశాలల అకౌంట్లలోకి జమ చేస్తామని ప్రకటించారని, కళాశాలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు. ఏ కళాశాలలోనూ విద్యార్థులను ఇబ్బందులు పెట్టరాదని సూచించారు.

ఆదిత్యుని సన్నిధిలో కార్తీక సందడి



ఇంద్రపుష్కరిణిలో దీపారాధన చేస్తున్న మహిళలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో కార్తీక నాలుగో ఆదివారం సందడి కనిపించింది. ఈ సందర్భంగా చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాసం సందర్భంగా ఇంద్రపుష్కరిణిలో కార్తీక దీపారాధన చేయడంతో పాటు ప్రత్యేక ప్రసాదాలను స్వామికి నివేదించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఆలయ ఈఓ వై.భద్రాజీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. సాధారణ దర్శన భక్తులు ఒక్కసారిగా పెరిగిపోవడంతో ఎండలో క్యూలలో బారులు తీరారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.5,46,800, పూజలు, విరాళాల ద్వారా రూ.57,159, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.85 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ తెలిపారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు



బస్సుకు జెండా ఊపుతున్న డీఎంలు అమరసింహుడు, కెఆర్ఎస్ శర్మలు

శ్రీకాకుళం అర్బన్: కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలైన పంచారామాలను సోమవారం ఒకేరోజు దర్శించుకునేందుకు వేసిన ప్రత్యేక బస్సులు పంచారామాలకు బయల్దేరాయి. ఈ బస్సులను శ్రీకాకుళం ఆర్టీసీ ఒకటి, రెండు డిపోల మేనేజర్‌లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మలు జెండాలు ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పంచారామాల ప్రత్యేక బస్సులు బయలుదేరి వెళ్లాయని తెలిపారు. ఈ సర్వీసులలో టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలో గల శివాలయాల దర్శనానికి వెళ్తారని చెప్పారు. 24వ తేదీ ఆదివారం శ్రీకాకుళం ఒకటో డిపో నుంచి మూడు బస్సులు, శ్రీకాకుళం రెండో డిపో నుంచి రెండు బస్సులు కలిపి మొత్తంగా జిల్లా నుంచి పంచారామాలకు ఐదు బస్సులు బయలుదేరి వెళ్లినట్లు తెలిపారు. అలాగే శబరిమల యాత్రకు కూడా వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతోందన్నారు. అయ్యప్పస్వాములు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. 'ఒక్క ఫోన్ కాల్ తో మీ వద్దకు ఆర్టీసీ బస్సు' అనే నినాదంతో ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9959225608, 9959225609, 9959225610, 9959225611 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్‌లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎండిఎ బాషా, ప్రసాద్, ఎంపీ రావు, మురళి, ఆర్టీసీ సెక్యూరిటీ విభాగం ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

పోరాటాలతో విద్యారంగాన్ని కాపాడుకుందాం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు
- హరిపురంలో యూటీఎఫ్ స్వర్ణ ఉత్సవ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరులు

కాశీబుగ్గ: ప్రభుత్వ రంగ సంస్థలను పోరాటాలతోనే కాపాడుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. మందస మండలం హరిపురం ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించారు. హరిపురం ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి హరిపురం మెయిన్ రోడ్ మీదుగా రట్టి రోడ్డు జంక్షన్ అక్కడ నుంచి హరిపురం బస్టాండ్, బస్టాండ్ నుంచి ఉన్నత పాఠశాల వరకు ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేసి ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. 2025 మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి యూటీఎఫ్ సీనియర్ నాయకురాలు కోరెడ్ల విజయ గౌరీ అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, కొంచాడ జగన్న, మట్ట ఖగేశ్వరరావు, టెక్కలి డిప్యూటీ విద్యాశాఖాధికారి విలియమ్స్, యూటీఎఫ్ నాయకులు గొంటి గిరిధర్, చౌదరి రవీంద్ర, సీఐటీయూ జిల్లా కార్యదర్శి తేజేశ్వరరావు, గుంట కోదండరావు, గున్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీడి తోటలు సేకరిస్తే బతుకుల్లో విధ్వంసమే



పలాస: హరితవనం లాంటి ఉద్దానంలో ముఖ్యంగా ప్రజల జీవనాధారమైన జీడి పంట విస్తారంగా పండుతున్న ప్రాంతంలో రైతులకు సంబంధించిన జీడి తోటలను ఎయిర్ పోర్టు పేరుతో సేకరించి జీవితాలను విధ్వంసం చేయాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పలాసలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలో జరిగిన ఉద్యమాలను వివరించారు. భూమి,భుక్తి కోసం ఈ ప్రాంతంలో అనేక పోరాటాలు జరిగాయని, అందులో భాగంగానే సోంపేట బీల, కాకరపల్లి పోరాటాలు జరిగాయన్నారు. ఆ పోరాటాల్లో ఎంతో మంది ప్రజలు తమ ప్రాణాలను ధారబోశారని చెప్పారు. ఇప్పుడు మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని తీరానికి ఆనుకొని ఉన్న 1400 ఎకరాల స్థలాన్ని ఎయిర్‌పోర్టు కోసం స్థల సేకరణ చేయడం దారుణమన్నారు. ముందు ఆ ప్రాంత ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాలని కోరారు.

ప్రజలకు తమ భవిష్యత్‌పై తగిన భరోసా ఇవ్వాలని చెప్పారు. మొత్తం సేకరించాల్సిన భూమిలో ఎక్కువ శాతం జిరాయితీ ఉందన్నారు. దీన్ని అన్ని ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని ప్రభుత్వం తమ ఆలోచనను వెనక్కి తీసుకోవాలని కోరారు. సమావేశంలో రైతుకూలీ సంఘం నాయకులు మామిడి మామిడి భీమారావు, మురిపింటి తాతారావు, పిన్నింటి రామయ్య, బంగ్లా కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రత్యేక అలంకరణలో ఉమారుద్రుడు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుడివీధి ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక సోమవారం ఆఖరి వారం సందర్భంగా ఆదివారం రాత్రి స్వామికి 2011 రుద్రాక్షలతో, పూలతో అలంకరణ చేశారు.

క్లుప్తంగా

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన



నిరసన తెలియజేస్తున్న కార్మిక నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేఖ విధానాలపై భవిష్యత్తులో ఉద్యమం ఉద్ధృతం చేయనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ అన్నారు. అరిణాం అక్కివలస గ్రామం పరిధిలో ఉన్న శ్యాంక్రిగ్ పిస్టన్స్ ప్లాంట్-3 వద్ద ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమల్లో విఫలమైందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు అశోక్, సురేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలు వీడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రణస్థలం: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు వీడాలని జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వెలమల రమణ అన్నారు. రణస్థలంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి సర్కారు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయని మండిపడ్డారు. కార్మిక , రైతు చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జోగిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా డాక్టర్ పూడి కిరణ్‌కుమార్



కవిటి: జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కవిటి మండలం కవిటి కొత్తూరుకు చెందిన జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమత నాగిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్టు పేర్కొన్నారు. తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో జమిలి ఎన్నికల నాటికి జిల్లా యువజన విభాగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు.

కెనైన్ డాగ్‌తో తనిఖీలు



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : గంజాయి అక్రమ రవాణా అరికట్టడంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలు, ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెన్సీల్లో ఆదివారం రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు జాగిలం కెనైన్ డాగ్‌తో తనిఖీలు చేపట్టారు. బస్సులు, రిజర్వేషన్ కౌంటర్ వద్ద పార్శిళ్లను, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

ఆర్టీసీ బస్సుల ప్రారంభం నేడు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం జోన్ జోనల్ చైర్మన్‌గా సియ్యారి దొన్నుదొర సోమవారం విజయనగరం బస్ స్టేషన్ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి ఆర్టీసీ చైర్మన్ కొనకాల నారాయణ తదితరులు హాజరుకానున్నారు. అనంతరం ఆర్టీసీ శ్రీకాకుళం 1, 2వ డిపోలకి చెందిన మూడు కొత్త అద్దె బస్సులను ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండవ డిపోల మేనేజర్లు హనుమంతు అమరసింహుడు, కె.ఆర్.ఎస్.శర్మ కోరారు.

మూగజీవాలకు.. మందుల కొరత

- పశు వైద్య కేంద్రాలకు నిలిచిన మందుల సరఫరా
- ఇబ్బందుల్లో పాడి రైతులు
- పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత జిల్లాలో దయనీయం



టెక్కలి డివిజన్ కేంద్రంలో పశు వైద్య కేంద్రాలకు మందులు సరఫరా చేసే పశు సంవర్ధక శాఖ డీడీ కార్యాలయం



టెక్కలి పశు వైద్య కేంద్రానికి ఆటోలో మేకలను తీసుకువచ్చిన పెంపకందారులు

టెక్కలి: జిల్లాలో వ్యవసాయం తర్వాత పాడి సంపదపైనే అత్యధిక మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పాడి పశువులు, మూగజీవాల పెంపకం చాలా జాగ్రత్తలతో చేపట్టాల్సి ఉంటుంది. ముఖ్యంగా సకాలంలో మందులు వాడకపోతే మూగజీవాల ప్రాణాలకే ప్రమాదం. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పశు వైద్య కేంద్రాలు నిర్వీర్యమవుతున్నాయి. మందుల సరఫరా నిలిచిపోవడంతో పశువులకు అత్యవసర వైద్య సేవల విషయంలో పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. గతంలో మిగిలిన మందులతోనే సిబ్బంది కాలం నెట్టుకొస్తున్నారు. అవసరమైన మందులు దొరక్క పెంపకందారులు ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి క్వార్టర్లీ విధానంలో మందులు సరఫరా చేయాల్సి ఉంది. నెలల తరబడి మందులు సరఫరా కాకపోయినా పట్టించుకునే వారే కరువయ్యారు. పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత జిల్లాలో పశువైద్యం దయనీయంగా మారడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి సారించి యుద్ధప్రాతిపదికన పశు వైద్యానికి సంబంధించిన మందులను సరఫరా చేయాలని పాడి రైతులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లా కేంద్రంలో పశు గణాభివృద్ధి కేంద్రం, పశు వ్యాధ నిర్ధారణ కేంద్రంతో పాటు నియోజకవర్గ స్థాయిలో 7 వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, సమగ్ర గొర్రెల అభివృద్ధి కేంద్రం, బహుళార్ధక సాధక పశు వైద్యశాల ఒకటి చొప్పున ఉన్నాయి. 77 పశు చికిత్సాలయాలు, 15 పశు వైద్య శాలలు, 61 గ్రామీణ పశు వైద్య కేంద్రాలు సేవలందిస్తున్నాయి. 644 రైతు భరోసా కేంద్రాలు(రైతు సేవా కేంద్రాలు)లో పశు వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. సంయుక్త సంచాలకుడు, నలుగురు ఉప సంచాలకులు, 65 మంది పశు వైద్యులు,18 మంది సహాయ సంచాలకులు ఉన్నారు. వీరితో పాటు ప్రతి రైతు సేవా కేంద్రంలో పశు సంవర్ధక సహాయకులు ఉన్నారు.

ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు	కోళ్లు
4,56,291	40,477	6,23,641	2,77,268	13,19,100

సొంతంగానే మందులు..



మా రెండు మేకలకు అనారోగ్య సమస్యలు వచ్చాయి. మా ఊరి నుంచి సొంతంగా ఆటోలో టెక్కలి పశువుల ఆసుపత్రికి తీసుకువస్తే ఇక్కడ వైద్యం చేసి మందులు రాశారు. ఆ మందులను బయట కొన్నాం.

–జలారి భీమారావు, మేకల పెంపకందారుడు

ప్రతిపాదనలు పంపించాం...



జిల్లాలో కొన్ని చోట్ల పశు వైద్యానికి సంబంధించి మందుల కొరత ఉండడం వాస్తవమే. మందుల సరఫరాకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. కొన్ని రకాల మందులు జిల్లాకు వచ్చాయి. డిసెంబర్‌లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

–ఆర్.మురళీధర్, పశు సంవర్ధక శాఖ జేడీ

ఉత్సాహంగా స్పెల్‌బీ పరీక్షలు



శర్వాణి విద్యాలయంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- ముగిసిన జిల్లాస్థాయి సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలు
- భారీగా హాజరైన బాలబాలికలు



పరీక్ష రాస్తూ..

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 2024-25 విద్యా సంవత్సరానికిగాను సాక్షి మీడియా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అరసవల్లి రోడ్‌లో ఉన్న శర్వాణి విద్యాలయ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఈ పరీక్షలకు ప్రెజెంటింగ్ స్పాన్సర్‌గా 'డ్యూక్స్ వాఫె', అసోసియేట్ స్పాన్సర్‌గా 'ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమండ్రి' వ్యవహరించాయి. కేటగిరిల వారీగా ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాక్షి మీడియా గ్రూప్ జిల్లా ప్రతినిధుల పర్యవేక్షణలో పాఠశాల ప్రతినిధుల సమక్షంలో పరీక్షలు నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలోని శర్వాణి విద్యాలయం, న్యూ సెంట్రల్ స్కూల్, విశాఖ స్కూల్, కె.నారాయణ(మందస) స్కూల్, తదితర పాఠశాలలు తోడ్పాటును అందించాయి. ఆయా పాఠశాలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. సాక్షి మీడియా అందించిన ప్రిపరేషన్ మెటీరియల్ తమకు ఎంతగానో ఉపయోగపడిందని విద్యార్థులు సంతోషం వ్యక్తం వ్యక్తంచేశారు. పిల్లల భవిష్యత్తు కోసం ఏటా ప్రత్యేక చొరవ తీసుకుని పరీక్షలను నిర్వహిస్తున్న సాక్షి మీడియాకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సహకరించిన పాఠశాలలకు కృతజ్ఞతలు..

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్‌బీ పరీక్షల నిర్వహణకు సహకరించిన శర్వాణీ విద్యాలయతోపాటు మిగిలిన పాఠశాలలకు సాక్షి మీడియా తరఫున శ్రీకాకుళం యూనిట్ బీఎం బీజేజీవీఆర్ స్వామి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శర్వాణి విద్యాలయ సంస్థల అధినేత అంధవరపు సూరిబాబు, కరస్పాండెంట్ ఎ.అంజనేయులు, డాక్టర్ రేఖ, న్యూ సెంట్రల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, ఝాన్సీ, విశాఖ స్కూల్ చైర్మన్ డాక్టర్ కె.మధుసూదన్, ప్రిన్సిపాల్ పి.రామారావు, కె.నారాయణ స్కూల్ డైరెక్టర్ గుంట బుద్ధసూర్య, ఎస్.నాగేశ్వరరావు, ఎం.శివకుమార్, జి.దీప్తి, టీచర్లు, సాక్షిమీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆనందంగా ఉంది..



సాక్షి మీడియా ఆధ్వర్యంలో జరిగిన సాక్షి కాంటెస్ట్ పరీక్షలకు హాజరుకావడం ఇదే తొలిసారి. ఆనందంగా ఉంది. మా పేరెంట్స్‌తో పరీక్షకు వచ్చాను.

– బి.లోహిత్, 2వ తరగతి, న్యూ సెంట్రల్ స్కూల్, పీఎన్‌కాలనీ, శ్రీకాకుళం

నమ్మకం కలిగింది..



సాక్షి కాంటెస్ట్‌కు హాజరుకావడం కోసం కొద్దిరోజులుగా పరీక్షకు సన్నద్ధమయ్యాను. దీంతో నాపై నాకు నమ్మకం కలిగింది. పరీక్షను బాగా రాశాను.

– లక్ష్మి మాధురి, 8వ తరగతి, కె.నారాయణ స్కూల్, కుంటికోట, మందస

సాక్షికి థ్యాంక్స్..



ముందుగా సాక్షి మీడియాకు థాంక్స్ చెబుతున్నాను. విద్యార్థుల భవిష్యత్తు కోసం, వారిలో దాగివున్న ప్రతిభను గుర్తించడం కోసం ఏటా సాక్షి స్పెల్ బీ, మ్యాథ్ బీ నిర్వహించడం గొప్ప విషయం.

– ఎం.స్ఫూర్తిశ్రీ, 10వ తరగతి, శర్వాణి విద్యాలయం స్కూల్, అరసవల్లి రోడ్

ప్రసంశనీయం..



దశాబ్దానికిపైగా అన్ని రంగాలను జాగృతం చేస్తూ నిత్యం ప్రజాపక్షాన నిలుస్తున్న సాక్షికి హ్యాట్సాఫ్. విద్యార్థుల ఉన్నతికి, వారిలోని సృజనాత్మకతను గుర్తించేందుకు వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించడటం ప్రసంశనీయం.

– అంధవరపు సూరిబాబు, శర్వాణి విద్యాలయ విద్యాసంస్థల అధినేత

రాష్ట్రస్థాయి వీవీఎం పోటీలకు సిక్కోలు విద్యార్థులు



హరిణి నవీన వైష్ణవి వేదశ్రీ

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) ప్రతిభా పరీక్షల్లో జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎన్‌సీఈఆర్టీ, విజ్ఞాన్ ప్రసార్, ఎన్‌సీఎస్ఎమ్‌లు సంయుక్తంగా గత నెల దేశవ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో వి.హరిణి(9వ తరగతి, గుజరాతీపేటలోని వరం మున్సిపల్ స్కూల్), బలివాడ నవీన, సీఎల్ఎన్ వైష్ణవి, జామి వేదశ్రీ (శ్రీకాకుళం హౌసింగ్‌బోర్డ్ కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్), రాష్ట్ర స్థాయికి ఎంపికైనవారిలో ఉన్నారని వీవీఎం పరీక్షల జిల్లా సమన్వయకర్త అన్నెపు పున్నయ్య తెలిపారు. వచ్చే నెల 15న రాజమండ్రి వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పోటీల శిబిరానికి వీరు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యార్థులను జిల్లా విద్యాశాఖధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, కౌశల్ కో ఆర్డినేటర్లు మధుబాబు, ఉమేష్‌కుమార్, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు అభినందించారు.

వైభవంగా లక్ష దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కొత్తూరు: మండల కేంద్రంలోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి లక్ష దీపోత్సవం కనుల పండువగా సాగింది. ఆలయ ధర్మకర్తలు బరాటం గోవిందరావు, వేలాది మంది భక్తుల సమక్షంలో వివిధ ఆకృతుల్లో దీపాలు వెలిగించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు, అన్నదానం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మహిమాన్వితం సూర్యోపాసన



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న షణ్ముఖశర్మ

శ్రీకాకుళం కల్చరల్: సూర్యోపాసన ఎంతో మహిమాన్వితమైనదని, సాధనతో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని రుషిపీఠం వ్యవస్థాపకులు సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఉపనిషన్మందిరం, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో 'శ్రీసూర్య దర్శనం'పై ప్రవచన యజ్ఞం రెండో రోజు ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకు దేహానికి ఉన్న సంబంధం రాజుకు, ప్రజలకు మధ్య ఉన్న సంబంధం వంటిదన్నారు. రాజ్యపాలన భోగం కోసం కాదని, యోగం కోసమని చెప్పారు. కార్యక్రమంలో మందిరం అధ్యక్షులు గుమ్మా నగేష్, సుమిత్రా కళా సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, నిష్టల నర్సింహమూర్తి, పులఖండం శ్రీనివాసరావు, గుత్తు చిన్నారావు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, తెన్నేటి విక్రమశర్మ, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, కొంక్యాన మురళీధర్, వి.కామేశ్వరరావు, పి.బాబూరావు, సనపల నారాయణమూర్తి, రమేష్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ జూడోలో పతకాల పంట



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ మేనేజర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. రేణిగుంట వేదికగా ఈ నెల 24, 25 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో రెండు బంగారు, మూడు కాంస్య పతకాలతో కలిపి మొత్తం ఐదు పతకాలు సాధించి శభాష్ అనిపించారు. బాలురు విభాగంలో ప్రసాద్ బంగారు పతకం, నవీన్, శివ, షణ్ముఖ కాంస్య పతకాలు సాధించగా, బాలికల విభాగంలో సౌమ్య బంగారు పతకం సాధించింది. ఓవరాల్ చాంపియన్‌షిప్ కేటగిరిలో బాలురు 3వ స్థానంలో, బాలికలు 4వ స్థానంలో నిలిచి సత్తాచాటారు. మేనేజర్‌గా వ్యవహరించిన పి.జగదీశ్వరరావు(పీఈటీ పోలవరం), క్రీడాకారులను డీఈఓ తిరుమల చైతన్య, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు బీవీ రమణ, ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, జూడో సంఘ ప్రతినిధులు ఆదివారం అభినందించారు.

హైందవ ధర్మాన్ని కాపాడుకుందాం



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న స్వామి శ్రీనివాసానంద

పొందూరు:

హైందవ సమాజాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద అన్నారు. మండలంలోని కృష్ణాపురం ఆనందాశ్రమంలో అఖిలాంధ్ర హిందూ మహా సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ నిత్యం శ్రీరామనామ జపం, అభిషేకాలు వంటివి చేస్తే హింధూ ధర్మం కాపాడిన వారమవుతామని చెప్పారు. స్త్రీలను అగౌరవపరచడం, గోహత్యలు, దేవాలయ వ్యవస్థ సరిగా లేకపోవడం, ధార్మిక గ్రంథాలను తప్పడు భావాలతో ప్రచారం చేయడం వంటి దుర్మార్గపు చర్యలను అడ్డుకోవాలన్నారు. హింధూ ధర్మ పరిరక్షణకు అందరూ ఏకంకావాలని పిలుపునిచ్చారు. ముస్లింలకు వక్ఫ్‌బోర్డు, క్రిస్టియన్లకు ప్రత్యేక బోర్డులు ఉన్నట్లు, హిందువులకు కూడా ప్రత్యేక బోర్డులను ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఒంగోలు భైరవానంద స్వామి, మంగళగిరి దయానంద దత్త స్వామి, అహోబిల జీయర్ స్వామీ, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సాయిబాబా గుడిలో చోరీ

బూర్జ: మండలంలోని కొల్లివలసలో సాయిబాబా గుడిలో వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబా మందిరంలో భక్తుల దర్శనార్థం ప్రధాన అర్చకులు గుడి తలుపుల వేయకుండా వెళ్లిపోయారు. శుక్రవారం దర్శనానికి వచ్చిన భక్తులు వెండి కిరీటం, శఠగోపం కలిపి సుమారు 25 తులాల ఆభరణాలు కనిపించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏపీఎస్టీఏ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక



మాట్లాడుతున్న ఏపీఎస్టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఏపీ ఎస్టీఏ) శ్రీకాకుళం జిల్లాశాఖ నూతన కార్యవర్గం ఎంపిక ఆదివారం జరిగింది. శ్రీకాకుళం ఎన్జీవో హోంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి చిన్నబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు, కొర్ల ఆనందరావు, జోగారావు, సాయిరాజ్, నారాయణరావు తదితరులు హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా సప్పటి మల్లేసు(ఇచ్ఛాపురం), ప్రధాన కార్యదర్శిగా పంచాది గోవిందరాజులు (పొందూరు), కోశాధికారిగా ఎస్.దాలప్పన్న (సంతబొమ్మాళి), కార్య నిర్వాహక అధ్యక్షుడిగా మేడిశెట్టి సాయిరాజ్ (జలుమూరు), సహాధ్యక్షుడిగా నెమలిపురి విష్ణుమూర్తి (వజ్రపుకొత్తూరు), ప్రధాన కార్యదర్శిగా పంచాది గోవింద రాజులు (పొందూరు), సంయుక్త కార్యదర్శిగా కె.కె.రామిరెడ్డి (టెక్కలి), కోశాధికారిగా యస్.దాలప్పన్న (సంతబొమ్మాళి), ఉపాధ్యక్షులుగా జగన్నాథ గౌడో (పలాస), సింగిపురం మురళి (పోలాకి), రోణంకి మోహనరావు (పాతపట్నం), నాగవంశపు సురేష్ (వజ్రపుకొత్తూరు), కార్యదర్శులుగా బొడ్డేపల్లి రామకృష్ణ (నందిగాం), మెట్ట రాంబాబు (నరసన్నపేట), కొయ్య పద్మనాభ రెడ్డి (ఇచ్ఛాపురం), మురిపాల జగన్నాథం (కవిటి), ఇతర కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

• విన్యాసాలు అదుర్స్





పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌బీఎస్‌వైఎం డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ 76వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రవీణకుమారి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ పతాకావిష్కరణ చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పిరిమిడ్ల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. – కాశీబుగ్గ